

# అమెరికా ఇల్లాలి ముచ్చట్లు
## శ్యామలాదేవి దశిక



అమెరికా ఐనా, అమలాపురమైనా ఇల్లాలు..ఇల్లాలే. ముచ్చట్లు ముచ్చట్లే..

ఓ అమెరికా ఇల్లాలు నెల నెలా మీతో పంచుకుంటున్న ముచ్చట్ల ముురిపాలు..!

### బతుకు పడవ

ఏమిటీ బయట మంచు చూసి మండి పడుతున్నారా?

తెలిసిన సంగతే కదా, అయినా ఇప్పుడేం కొంప మునిగిపోయిందటా బయటకు వెళ్ళకపోతే?

లేడికి లేచిందే పరుగని అనుకున్నవి ఆ క్షణంలో జరగాల్సిందే మీకు !

ఎందుకు అంత చిరాకు పడ్తారు. ఈ స్నో స్టామ్ ఇప్పుడిప్పుడే తగ్గదుకానీ, హాయిగా ఇంట్లో కూర్చుని ఎంజాయ్ చెయ్యండి ! ఎందుకు అలా నవ్వుతారు. ఓ చెంప స్నో పడుతూంటే సంబరాలు చేసుకుందాం రమ్మంటుందేమిటా అని అనుకుంటున్నారు కదూ ? అక్కడేవుంది మీ బస్తీ వాళ్ళకు, మా పల్లెటూరి వాళ్ళకు పెద్ద తేడా.

చిన్నప్పుడు చదూకోటానికి, పెద్ద అయిన తర్వాత పని చెయ్యడానికే పుట్టాం అనుకునే మీలాంటివాళ్ళు ఎక్కడున్నా ఒకటే. ఇన్నేళ్ళనుంచి అమెరికాలో వుండే లైఫ్ ఎంజాయ్ చెయ్యడం తెలీదు మీకు - ఇక గాలి వానలూ, మంచు తుఫాన్లు, మండుటెండలు ఎంజాయ్ చెయ్యడం ఏం తెలుస్తుంది?

అసలు సరదాగా గడపాలనే సంకల్పం, కాస్తంత క్రియేటివిటీ వుండాలేకాని ఎక్కడున్నా, ఎప్పుడైనా ఆనందంగా గడపవచ్చు. నాకు ఎలా తెలుసునంటారా?

నేను చిన్నప్పుడు అలాంటి వాతావరణంలో పెరిగినదాన్ని కనుక, పైపెచ్చు నేను కోనసీమ అమ్మాయిని - నా బుర్ర వజ్రాలగని!

మావూళ్ళో వానాకాలం వచ్చిందంటే మాకు వెకేషన్ అన్నమాటే ! మనసు ఎప్పుడు ఆటలమీద, అల్లరిమీద వుండే నాలాంటివాళ్ళకు వానలు పడినప్పుడల్లా బడి మూత పడటం పెద్ద బెనిఫిట్ !

బళ్ళోకి వెళ్ళక్కరలేదు సరి కదా, ఇంట్లో కూర్చుని బోలెడు ఆటలు ఆడుకోవచ్చు. చద్దెన్నం తినగానే దొరికిన చిత్తుకాగితాలన్నీ పోగేసుకుని అందరం రకరకాల పడవలు చేసుకునేవాళ్ళం. సాదా పడవలు, కత్తి పడవలు, రెండతస్తుల పడవలు, పువ్వుల పడవలు మాకున్న టాలెంటునిబట్టి చేసుకునేవాళ్ళం. మాచిన్నన్నయ్య పిల్లలందరికి "పడవల పందెం" పెట్టేవాడు. వానలో తడవకండర్రా అంటున్నా వినకుండా ఎవరికి వారు వాళ్ళ పడవ మునిగిపోకుండా వెళ్ళాలని, పందెంలో

గెలవాలనీ ఒకటే దండాలు పెట్టుకుంటూ గోలగోల చేసేవాళ్ళం !

ఈదురుగాలి, కుండపోతగా కురిసే వానలో బయటకు వెళ్ళలేనప్పుడు, పిల్లలందరం చేరి ఇంట్లో వున్న బిందెలు, బకెట్లు చూరుకింద పెట్టి నీళ్ళు నింపేవాళ్ళం. మనిషికి ఇన్ని చెంబులని లెక్కపెట్టి ఇచ్చిన వేడినీళ్ళతో ఆ ఈదురుగాలిలో స్నానం చేసి పొడి (వెచ్చని) బట్టలు వేసుకున్నప్పటి ఆనందం అనుభవించినవారికే తెలియాలి. ఇంట్లో కూరా, నారా ఏమీ లేకపోయినా పెద్ద రాచిప్పలో అమ్మ పెట్టే పప్పుపులుసు ఘుమఘుమ, వేడి వేడి అన్నంలో కందిసున్ని, తియ్యని గడ్డపెరుగు రుచి ముందు మీ ఫైవ్ స్టార్ హోటల్ భోజనం ఎందుకూ పనికి రాదు.

నాన్న, అన్నయ్య పుస్తకాలు చదువుకుంటే, అమ్మ మమ్మల్ని కూర్చోబెట్టి గవ్వలాట, పచ్చీసు ఆటలు ఆడించేది. రాత్రికి నాన్న అందరికి కాశీమజలీ కథలు చెప్పేవారు.

ఏడాదిపాటు కష్టపడగా చేతికొచ్చిన పంట చివరికి ఏమైపోతుందో అని నాన్న పడే ఆందోళన గాని, ఇంటికప్పు ఎక్కడ కూలిపోతుందో అన్న అమ్మ భయం కాని చిన్నపిల్లలమైన మాకు తెలిసేది కాదు. మాకు తెలిసిందల్లా కుండపోతగా వర్షం పడితే ఇంటిల్లిబాదికి ఆటవిడుపని !

అందుకే నా ఫిలాసఫీ కూడా లైఫ్‌ని వీలైనంతవరకు నవ్వుతూ, సరదాగా గడిపయటమే ! జీవితంలో తుఫానులు ఎదురైనప్పుడల్లా మా బతుకు అనే పడవ మధ్యలో మునిగిపోకుండా ఎలాగో అలాగు తీరానికి చేర్చు స్వామీ అని వేడుకుంటూవుంటాను.

ఇదిగో మిమ్మల్నే వింటున్నారా ?

నామాట విని బయటకు వెళ్ళే ప్రోగ్రాము కాన్సిల్ చేసుకోండి.

అల్లం పచ్చడితో వేడివేడిగా M.L.A. పెసరట్టు తిందాం. ఆ తర్వాత ----

ఏమిటీ నా అయిడియా అద్భుతంగా వుందా?

అమ్మయ్యా, ఇన్నాళ్ళకు లైటు వెలిగింది !